ప్రజాశక్తి
సోమవారం 1 ఏప్రిల్, 2024
శ్రీకాకుళం



## 3న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

### డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకటరామన్



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 3న నిర్వహించనున్నట్లు డిప్యూటీ సిఇఒ ఆర్. వెంకటరామన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశానికి సభ్యులతో పాటు అధికారులు హాజరు కావాలని సూచించారు.



# పనసతో పసందు

- ఉద్దానంలో అధిక దిగుబడి
- ఆదాయంతో పాటు ఆరోగ్యం

**జిల్లా వ్యాప్తంగా పనస పంట సాగుచేస్తున్నా ఉద్దానం ప్రాంతంలో పండే పనసకు మంచి గిరాకీ ఉంటుంది. కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో సుమారు 300 ఎకరాల్లో పనస పంట సాగు చేస్తుండగా, 600 నుంచి 650 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ఈ పంట ఎక్కువగా ఒడిశా రాష్ట్రం బరంపురం, భువనేశ్వర్, కటక్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుండగా, కొద్ది మొత్తంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తరలిస్తున్నారు. అయితే ఉద్దానం ప్రాంతంలో అంతరపంటగా సాగుచేస్తున్న ఈ పనస రైతులకు అటు ఆర్థికంగా ఉతమందిస్తుండడమే కాకుండా ఇటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పనసతో లాభాలు ఒకసారి పరిశీలిస్తే...**

ప్రజాశక్తి- కవిటి

ఉత్తర భారతంతో పోలిస్తే దక్షిణాన పనసను ఎక్కువగా పండిస్తున్నారు. అందుకే ఇక్కడ వినియోగమూ ఎక్కువే. ఒక్క కేరళలోనే వంద రకాల పనస చెట్లు పెరుగుతున్నాయి. పనసతో కూరలు, వేపుళ్లు, చిప్స్, అప్పడాలు, స్వీట్లు మామూలే. అయితే బెంగుళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టీకల్చర్ రీసర్చ్ ఇటీవల జాక్‌ఫ్రూట్ జ్యూస్, చాక్లెట్లు, బిస్కెట్లను తయారు చేసింది. మూడేళ్ల పరిశోధనల తరవాత పనస గుజ్జుతో జ్యూస్‌ను ఉత్పత్తి చేస్తోంది సంస్థ. ఇందులో చక్కెర, నిల్వ పదార్థాలు వాడలేదు. అయినా ఆరు నెలల వరకూ చెడిపోకుండా ఉంటుందని, శీతల పానీయాలకు బదులుగా ఈ జ్యూస్ తాగడం ఆరోగ్యానికి మేలని సంస్థ ప్రకటించడం విశేషం. గోధుమ పిండి, పనస గింజల పిండి, కొకోవాతో చాకొలెట్‌లు, బిస్కెట్లను కూడా తయారు చేస్తున్నారు.

**వరి, గోధుమల కంటే మేలు..**


పనస ఎక్కువగా పండే కేరళ, గోవా, కర్నాటక, ఆంధ్రా లాంటి రాష్ట్రాల్లో కొంతమంది ఔత్సాహికులు సంప్రదాయ వంటలకు మారుగా పనసతో అనేక ప్రయోగాలు చేస్తున్నారు., జాక్‌ఫ్రూట్ బర్గర్లు, గలౌటీ కబాబ్స్, మసాలా దోశ, బిర్యానీలను వండేస్తున్నారు. ఈ కోవలోకే వచ్చేది జాక్‌ఫ్రూట్ 365. పనస కాయతో చేసిన పిండి ఇది. పనస గ్లైసెమిక్ ఇండెక్స్ వరి, గోధుమల కన్నా నలభై శాతం తక్కువ. కాబట్టి మధుమేహుల ఆరోగ్యానికి మంచిది. పనస పిండిని వంటల్లో వాడడం వల్ల రక్తపోటు, సుగరు నియంత్రణలో ఉంటాయి. మార్కెట్లో ఈ మధ్యే వచ్చాయి జాకోబైట్. పనస తొనల్ని ఫ్రీజర్‌లో పెట్టి గడ్డకట్టేలా చేస్తారు. ఇవి మూడు నెలల వరకు చెడిపోవు. ఇలా పనసను కూడా మామిడి, ద్రాక్షలాగ విరివిగా ఉపయోగించడం ఇప్పుడిప్పుడే మొదలవుతోంది.

### పనస బిర్యానీకి డిమాండ్

కరోనా కారణంగా మన జీవన విధానం పూర్తిగా మారింది. ఈ గడ్డు కాలంలో పనసకు డిమాండ్ అమాంతం పెరిగింది. ఇన్‌ఫెక్షన్ల కారణంగా మాంసాన్ని తినడానికి చాలా మంది భయపడతారు. వాళ్లందరికీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది పనస. దీంతో చికెన్, మటన్ కన్నా కూడా పనస బిర్యానీ అధిక ధరకు అమ్ముడవుతోంది. బెంగాల్‌లో పనసను 'గాచ్ పతా' గా పిలుస్తారు. అంటే గొర్రె చెట్టు అని అర్థం. కాయపనస ముక్కలు, తొనలు మటన్‌లా ఉండడం వల్ల ఆ పేరు స్థిరపడిందేమో. అందుకే ప్రత్యేక రోజుల్లో పనన వంటలను వండుతుంటారు. ఉల్లిగడ్డ, అల్లం వెల్లుల్లి కలిపి వండిన పనస కూర అందించే రుచిని వర్ణించలేం అంటారు బెంగాలీలు. ఇక బిహార్‌లో 'కాలా మటన్ కర్రీ' తరహాలో పనసకు సుగంధ ద్రవ్యాల్ని కలిపి తక్కువ మంటమీద ఉడికించి చేస్తారు. బిహార్‌లో జాక్‌ఫ్రూట్ కట్లెట్స్ చాలా ఫేమస్. ఇక ఆంధ్రా స్టైయిల్ పనస పొట్టు ఆవ కూర ప్రపంచమంతా ప్రాచుర్యం పొందింది. దాంతో పాటు పనస కూర, గింజల వేపుడు, పనస పొట్టు బిర్యానీ, పనస కాయ బిర్యానీ కూడా ఇక్కడి ప్రత్యేక రుచులుగా చెప్పాలి. గోవాలో కొన్ని వంటకాల్లో చేపకు బదులుగా పనసను వాడడం విశేషం.

### వంద గ్రాముల పనసలో...

- కెలోరీలు- 94
- కొవ్వు-0.3 గ్రాములు
- పీచు పదార్థాలు- 2 గ్రాములు
- ప్రొటీన్లు- గ్రాము
- పొటాషియం- 303 మిల్లీ గ్రాములు
- కాల్షియం-34 మిల్లీ గ్రాములు
- కార్బోహైడ్రేట్స్- 24 గ్రాములు
- ఫొలేట్- 14 మైక్రో గ్రాములు
- ఐరన్- 0.6 మిల్లీగ్రాములు



### నాణ్యతలో మేటి

ఉద్దానంలో సాగుచేస్తున్న పనస మిగతా ప్రాంతాల్లో సాగుచేస్తున్న వాటికంటే శ్రేష్ఠమైనవి. నాణ్యత, పరిమాణంలో ఈ ప్రాంతంలో పండిన పండుకు మిగతావి సాటిరావు. ఎందుకంటే ఇక్కడ అంతా సేంద్రీయమే. ఎటువంటి ఎరువులు పురుగు మందులు వాడరు. ముఖ్యంగా ఉద్దానం రైతులకు పనస ఒక వర ప్రదాయిని. తక్కువ పెట్టుబడితో ఆదాయం వచ్చే పంట పనస. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కాబట్టి ఉద్దానం పనసకు ఎప్పటికీ డిమాండ్ తగ్గదు. **- పి.మాధవీలత, ఉద్యానశాఖ అధికారి, కవిటి**



మాట్లాడుతున్న ధనలక్ష్మి

# 'ఆశా'లపై వేధింపులు ఆపాలి

### ఎపి ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆశాలపై జిల్లా అధికారులు చేస్తున్న వేధింపులు వెంటనే ఆపాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి హెచ్చరించారు. ఈ మేరకు నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని సమస్యలు జిల్లాలో ఆశావర్కర్లు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని అధికారులు ఆశావర్కర్లని బానిసలుగా చూస్తున్నారని అన్నారు. ఆశా వర్కర్లతో సబ్ సెంటర్లను, సచివాలయాల్లో ఉండే హెల్త్ అసిస్టెంట్‌కు సంబంధించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఊడ్చే పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సెంటర్లలో కూర్చోవాలని చెప్పడం, రికార్డుల్లో సంతకాలు చేయాలని చెప్పడం సరైంది కాదన్నారు. స్వీపరు పనులు చేయాలన్న నిబంధన ఎక్కడా లేదని అన్నారు. ఆశావర్కర్లతో వెట్టిచాకిరీ పనులు చేయించుకోమని జిఒ వచ్చి ఉంటే చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.నాగమణి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, నాయకులు కె.లక్ష్మి, జి.కృష్ణవేణి, ద్రౌపది, ప్రేమలత పాల్గొన్నారు.

## 'గుండ' దంపతులకు పిలుపు



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజకవర్గంలో టిక్కెట్టు రాకపోవడంతో మనస్తాపానికి గురైన గుండ దంపతులకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నుంచి ఎట్టకేలకు పిలుపు వచ్చింది. ఆయన తరపున పరిశీలకులు శ్రీనివాసరెడ్డి వచ్చి ఆహ్వానం తెలుపుతూ హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి రావాలని కోరినట్టు తెలిపారు. దీంతో గుండ దంపతులు తన కుమారుడు విశ్వనాథ్‌ను వెంటబెట్టుకుని ఆదివారం హైదరాబాద్ పయనమయ్యారు. ఈ మేరకు ఈ సమాచారాన్ని వారి అనుచరులతో పంచుకున్న అనంతరం బయలుదేరి వెళ్తున్నట్లు గుండ దంపతులు వెల్లడించారు.

# సొంత గూటికి కృపారాణి?

### కాంగ్రెస్ పెద్దలతో మంతనాలు



ప్రజాశక్తి- టెక్కలి

కేంద్ర సహాయ మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి సొంత పార్టీ అయిన కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరలా కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలోకి దిగేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. అయితే తాను పార్టీలో చేరాలా? తన పెద్ద కుమారుడు కిల్లి విక్రాంత్‌ను రాజకీయాల్లోకి దింపాలా? అనే సందిగ్ధ పరిస్థితుల్లో కృపారాణి ఉన్నట్లు తెలిసింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కాంగ్రెస్‌ను వీడిని కృపారాణి వైసిపిలో చేరారు. జిల్లా అధ్యక్షులుగా కొన్నాళ్లు పనిచేశారు. ప్రస్తుతం ఆమెకు వైసిపిలో ప్రాధాన్యత లేకపోవడంతో సొంత గూటికి వెళ్తున్నట్లు ప్రచారం సాగుతుంది. ఢిల్లీ, హైదరాబాద్‌ని పెద్దలతో మంతనాలు చేసినట్లు సమాచారం. ఈ మేరకు పిసిసి అధ్యక్షులు షర్మిల భర్త అనిల్‌బ్రదర్, రఘువీరారెడ్డి, మల్లిఖార్జు ఖర్గే వంటి సీనియర్ నేతలను కలిసినట్లు తెలిసింది. కృపారాణి చేరిక విషయమై డిసిసి కార్యాలయానికి ఎటువంటి సమాచారం లేకపోవడం గమనార్హం.

# ఈ ఐదేళ్ల పాలన రాతి యుగం



కవిటి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

అనుభవం, బాధ్యత ఉన్న నేతగా రాష్ట్ర భవిష్యత్, ప్రజా సంక్షేమం కోసం చంద్రబాబు నాయుడు పోరాటం చేస్తున్నారని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. శ్రీకాళహస్తిలో జరిగిన ప్రజాగళంలో చంద్రబాబు మాట్లాడుతూ తనకు తాను డ్రైవర్‌గా అభివర్ణించారని అన్నారు. ప్రజలను రాతియుగం నుంచి స్వర్ణయుగం వైపు నడిపించే రథసారథి చంద్రబాబు నాయుడని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు బెందాళం రమేష్, సీపాన వెంకటరమణ, సంతోష్ పట్నాయక్, మణిచంద్ర ప్రకాష్ పాల్గొన్నారు.

**శ్రీకాకుళం అర్బన్ :** జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజలు జీవితాలు వెనక్కి నెట్టబడ్డాయని, రాతియుగం నాటి అవశేషాలను మిగిల్చి మిగిలివన్నీ దోచుకున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ధ్వజమెత్తారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి తిరిగి ప్రగతి పథం వైపు నడిపించాలంటే చంద్రబాబువల్లే సాధ్యమవుతుందని చెప్పారు. రాతియుగం నుంచి తిరిగి స్వర్గయుగం వైపునకు నడిపించేందుకు చంద్రబాబు డ్రైవరు నవుతానని చెప్పడం ఆయన సమర్థతకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అసమర్థ, అవినీతి పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందన్న విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. యువత బాగుకోరే చంద్రబాబు ప్రభుత్వం తిరిగి రావాలన్నారు.

# చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

### 25 తులాల బంగారం స్వాధీనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని బొంత వారి వీధిలో మార్చి 2న ఇంట్లో జొరబడి చోరీకి పాల్పడ్డ ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకుని అరెస్టు చేశామని, వారి వద్ద నుంచి 25 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని శ్రీకాకుళం డిఎస్‌పి శృతి తెలిపారు. నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బొంతవారి వీధిలో భమిడిపాటి జగదాంబ, ఆమె కుమారుడు శ్రీనివాస్‌లు నివాసం ఉంటున్నారని అన్నారు. మార్చి 2న ఉదయం 9 గంటల సమయంలో తన కొడుకు శ్రీనివాస్ విధులకు హాజరయ్యేందుకు వెళ్లాడు. జగదాంబ ఒక్కరే ఇంట్లో ఉండగా ఉదయం 11.15 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి శివాలయం పూజారి పంపించారని నమ్మబలికి ఇంట్లోకి ప్రవేశించారని అన్నారు. ఆమె నోట్లో గుడ్డలు కుక్కి చేతులు కట్టేశారని చెప్పారు. కేకలు వేస్తే చంపుతామని బెదిరించి ఆమె వద్ద ఉన్న 16 బంగారు గాజులు , 3 పేకల బంగారు గొలుసులు, ఇతర వస్తువులు తీసుకుని పరారయ్యారని అన్నారు. అదే రోజు బాధితురాలు జగదాంబ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించారు. ఆ పరిసరాల్లో ఉన్న వెబ్ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు గాలింపు చేపట్టామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా భద్రాచలానికి చెందిన చల్లా జంపన్న, ఎఎస్ఆర్ జిల్లా ఏటి కొప్పాక మండలం సీతారాంపురానికి చెందిన పొదుటూరి సాంబశివరావులే ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించామని అన్నారు. రూరల్ సిఐ సన్యాసినాయుడు, వన్‌టౌన్ ఎస్ఐ బి.గణేష్‌లు బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టామని తెలిపారు. ఎట్టకేలకు ఆదివారం నగరంలోని కోటేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో సంచరిస్తున్న వీరిద్దరినీ పట్టుకున్నట్టు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులిద్దరు ఇటీవల శ్రీకాకుళం నగరానికి వచ్చిన సమయంలో ఆటోలో ప్రయాణించారు. అదే ఆటోలో ఉన్న జగదాంబతో మాటలు కలిపారన్నారు. ఆమె నివాస ముంటున్న ఇంటితో పాటు అన్ని విషయాలు ఆమెతో మాటలు కలిపి తెలుసుకున్నారని తెలిపారు. వీరు ఒంటరిగా నివాస ముంటున్న సమయం తెలుసుకుని చోరీకి పాల్పడినట్టు డిఎస్‌పి వివరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. కేసును ఛేదించిన సిఐ, ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి శృతి

# పోస్టల్ బ్యాలెట్‌కు యంత్రాంగం కసరత్తు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ఉపయోగించుకునే వారి సంఖ్య ఈసారి గణనీయంగా పెరగనుంది. అందుకు తగ్గట్టుగా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. గతంలో పోస్టల్ బ్యాలెట్‌ను కేవలం ఎన్నికల విధుల్లో పాల్గొనేవారికి, సరిహద్దు రక్షణ దళాల్లో పని చేసేవారికి మాత్రమే ఈ సౌకర్యాం ఉండేంది. కానీ, ఈసారి ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని వెసులబాట్లు కల్పించింది. ఎన్నికల విధుల్లో పాలుపంచుకునే ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులతోపాటు మీడియా ప్రతినిధులకు, 85 ఏళ్లుదాటి మంచానికే పరిమితమైన వయో వృద్ధులు, 40 శాతం పైబడి వైకల్య ఇబ్బందులు ఎదుర్కొంటూ కదల్లేని స్థితిలో ఉన్న వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే సౌలభ్యాన్ని కల్పిస్తున్నారు. ఎన్నికేతర విధుల్లో ఉండే డ్రైవర్లు, నాలుగో తరగతి ఉద్యోగులనూ ఈ జాబితాలో చేర్చారు.





2019 ఎన్నికల్లో కేవలం ఎన్నికల విధుల్లోని ఉద్యోగులతో పాటు సర్వీసు ఓటర్లకు మాత్రమే ఈ సదుపాయం కల్పించారు. అప్పట్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సుమారు ఆరు నుంచి 8 వేల మధ్యవరకు వినియోగించుకున్నారు. ఈసారి సంఖ్య రెట్టింపయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జిల్లాలో 8 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ప్రతి ఓటరూ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు చెరో ఓటు వేయాల్సి ఉంటుంది. ఈ కారణంగా పోలింగ్ సిబ్బంది సంఖ్య పెరిగింది. నిర్వహణకు దాదాపు జిల్లాలో ఈసారి

### పెరిగిన సంఖ్యకు తగ్గట్టు ఏర్పాట్లు

సుమారు 16 వేల మందికి పైగా ఉద్యోగులు అవసరం ఉందని అంచనా. ఇసి అదనంగా అనుమతి ఇచ్చిన ఉద్యోగులు సర్వీసు ఓటర్లు మరో ఐదారువేల మంది వరకు ఉన్నారు. వయో వృద్ధులు, వికలాంగులు కలుపుకుని ఈ సారి జిల్లాలో సుమారు 30 వేల వరకు పోస్టల్ బ్యాలెట్ అవసరం కావచ్చని, వచ్చిన దరకాస్తుల ఆధారంగా లెక్కలేసి పోస్టల్ బ్యాలెట్‌ను సిద్ధం చేయనున్నారు. ఎన్నికల విధులకు నియమితులయ్యే వారికి ఈ నెలాఖరులో తొలివిడత శిక్షణ ఇస్తారు. రెండో విడత శిక్షణ నిమినేషన్ల ప్రక్రియ మొదలైన తర్వాత ఇవ్వనున్నారు. రెండో విడత శిక్షణ శిబిరం సమయంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి అక్కడే పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. ఒక వేళ ఇక్కడ ఇష్టం కాకుంటే అసెంబ్లీ, పార్లమెంట్ ఆర్ఒ కార్యాలయాల్లో ఏర్పాటు చేసే డ్రాప్ బాక్సుల్లో వేయొచ్చు. ఎన్నికలు జిల్లాలో నాలుగో దశలో జరగనున్నాయి. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ రానుంది. 29న నామినేషన్ల గడువు పూర్తయి ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తేలనున్నారు. ఆ తర్వాతే బ్యాలెట్ పేపర్ అందుబాటులోకి వస్తుంది. పోస్టల్ బ్యాలెట్ పత్రాల వ్యవహార బాధ్యతలను జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనే వారు తమ ఓటు ఏ నియోజకవర్గం పరిధిలో ఉంది? పోలింగ్ కేంద్రం, వరస సంఖ్య వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి.

# నేటి నుంచి 'పది' మూల్యాంకనం

- జిల్లాకు చేరుకున్న 1.85 లక్షల జవాబుపత్రాలు
- డిఇఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు-2024 జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియకు సర్వం సిద్ధమైందని డిఇఒ వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లాలో ఏప్రిల్ ఒకటి నుంచి మొదలయ్యే మూల్యాంకనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎనిమిది రోజుల్లో స్పాట్ పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం పక్కాగా సన్నద్ధమైందన్నారు. తాగునీరు, ఫర్నీచర్, లైటింగ్, ఫ్యాన్లు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మొత్తం 7 పేపర్లకు సంబంధించి 24 పేజీల బుక్‌లెట్లతో కూడిన రెండు లక్షల పేపర్లు జిల్లాకు చేరుకున్నాయని చెప్పారు. కోడింగ్ ప్రక్రియ శరవేగంగా సాగుతోందన్నారు. తెలుగు, ఇంగ్లీష్, ఒరియా మీడియం జవాబుపత్రాలు దిద్దుబాటు జరగనుందని తెలిపారు. నగరంలో అందుకు వసరమైన సిబ్బందిని నియమించాం. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు, కలెక్టర్ సూచనల మేరకు అధికారులు, ఎగ్జామినర్లు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, చైతన్య పాఠశాలల్లో మూల్యాంకనం కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.



మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఇఒ వెంకటేశ్వరరావు

**కొద్ది రోజుల్లోనే...**

మార్చి 18 నుంచి 28 వరకు పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. కొద్ది రోజుల్లోనే వెంటనే మూల్యాంకనం చేపట్టడం విశేషం. తెలుగు, సాంఘీకశాస్త్రం, జీవశాస్త్రం సబ్జక్టులకు బాలికోన్నత పాఠశాల కేంద్రం కేటాయించారు. హిందీ, ఆంగ్లం, భౌతిక రసాయనిక శాస్త్రం, గణితం సబ్జెక్టులకు చైతన్య పాఠశాల కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఇందు కోసం సిఇఒ స్పెషల్ అసిస్టెంట్ల నియామకానికి సుమారు 12 వందల మంది ఉపాధ్యాయులను నియమించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మూల్యాంకనం చేపట్టే ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కావాల్సిన మౌలిక సదుపాయాలనూ ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం చేపట్టే విధంగా ఆదేశాలు జారీ అయ్యాయి. మూల్యాంకనం చేపట్టే ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు వినియోగించకుండా జాగ్రత్తలు చేపట్టనున్నారు. మూల్యాంకనం అనంతరం ఏప్రిల్ మూడో వారంలోనే ఫలితాలు వెలువడే ఆవకాశాలు ఉన్నాయని పలువురు భావిస్తున్నారు.

# వాలంటీర్లపై కుట్ర తగదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వాలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న కుట్రలు తగవని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సుపరిపాలనే లక్ష్యంగా వాలంటీర్ల వ్యవస్థ ఆవిర్భవించిందని, అటువంటి వ్యవస్థపై ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్న తీరు సరికాదని అన్నారు. నిరు పేదలకు మేమున్నామంటూ అభయమిచ్చే వాలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు అనైతిక చర్యలకు పాల్పడడం హేయమైన చర్య అని అన్నారు. స్వచ్ఛంద సంస్థ పేరుతో వాలంటీర్లు నిర్వహిస్తున్న విధులకు దూరంగా ఉండేలా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంలో ప్రతిపక్ష పార్టీల కుట్ర పూరిత ఆలోచనలు దాగి ఉన్నాయని విమర్శించారు. వికలాంగులకు, వృద్ధులకు అందాల్సిన సంక్షేమ పథకాలు నిలిచిపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

**వాలెంటర్లపై అంతా కక్ష ఎందుకో? : మంత్రి**

**పలాస :** వాలంటీర్లపై చంద్రబాబు కక్ష సాధించడం వల్ల పింఛనుపైనే ఆధారపడి బతుకుతున్న అవ్వతాతా అవస్థలు పడతారని పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస మంత్రి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సచివాలాయాలు, వాలంటీర్లు వ్యవస్థ ఏర్పాటు చేసి నేరుగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని అన్నారు. ఎన్నికల మాజీ అధికారి నిమ్మగెడ్డ రమేష్ అనే వ్యక్తి ద్వారా వారిపై ఫిర్యాదు చేయడం బాధాకరమన్నారు. ఒక రాజ్యాంగ వ్యవస్థలో ఉన్న వ్యక్తి మాజీ సిఎం చంద్రబాబు కోసం పని చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. పదవీ విరమణ చేసిన తరువాత నిమ్మగెడ్డ ఒక సంస్థను పెటుకొని చంద్రబాబు కోసం పనిచేస్తుంటే వారికి కొంత మంది మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు.





ఇంగ్లీష్ మీడియం చదువులు పెడితే పేదలు పేదలుగానే ఉండాలని, దానిపై కూడా కేసులు వేశారని అన్నారు. 14 ఏళ్ల పాలనలో పేదలకు సెంటు భూమి ఇవ్వని చంద్రబాబు, జగన్ 33 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తే దానిపైనా కోర్టుకు వెళ్లారన్నారు. సచివాలయ వ్యవస్థను ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటే దానిపైనా కోర్టుకు వెళ్లారని, దమ్ముంటే ఆ వ్యవస్థను ఆపగలరా? అని ప్రశ్నించారు. విశాఖ పరిపాలన రాజధానిగా చేస్తామంటే అమరావతిలో తమ సామాజిక తరగతిలో సామ్రాజ్యంలో ఉండాలని చంద్రబాబు పాకులాడుతున్నారన్నారు. చంద్రబాబు వ్యవస్థలను అడ్డం ఎటుకొని ప్రజలకు జరగాల్సిన మంచిని దూరం చేస్తున్నారని ఆరోపించారు. సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా గడపగడపకు పథకాలు అందుతుంటే... చంద్రబాబు తటుకోలేక పోతున్నారని అన్నారు. కోవిడ్ సమయంలో వాలంటీర్లు సేవలు అమోఘమని కొనియాడారు. చంద్రబాబు పాలనలో అవ్వతాతలు కిలోమీటర్లు పొడవునా నడిచివెళ్లి, జన్మభూమి కమిటీల ఎదుట మోకాళ్లపై నిలిచి ఉండేవారన్నారు. 14 ఏళ్ల కాలంలో ఒక్క మెడికల్ కాలేజి కూడా కట్టలేకపోవడం దౌర్భాగ్యమని ఎద్దేవా చేశారు. నెలరోజుల్లో టిడిపి శాశ్వతంగా దూరం అయిపోతుందని, చంద్రబాబు, అండ్ ముఠాను రాష్ట్రం నుంచి తరమికొట్టాలని పిలుపునిచ్చారు.

## మెడికల్ హబ్‌గా పలాస

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఇటీవల కాలంలో పలు ఆస్పత్రులు ప్రారంభం అవుతున్నాయని, పలాస మెడికల్ హబ్‌గా మారుతుందని రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అభిప్రాయ పడ్డారు. కాశీబుగ్గలో జనరల్ మెడిషన్ ఎండి చేసిన డాక్టర్ రోహిత్ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ రాధాకృష్ణ ఆస్పత్రిని ఆదివారం మంత్రి అప్పలరాజు ప్రారంభించారు. ప్రథమంగా మాజీ జెడ్‌పిటిసి వడిశ హరిప్రసాద్‌కు వైద్యపరీక్షలు నిర్వహించారు. గతంలో ఇదే ఆస్పత్రిలో రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సేవ్ ఆస్పత్రి ఏర్పాటు చేసి వైద్య సేవలను అందించి సక్సెస్ ఫుల్ వైద్యునిగా పేరు పొందానని జ్ఞాపకాలను సహచరులతో మంత్రి పంచుకున్నారు. కార్యక్రమంలో వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవాని శంకర్, వైస్ చైర్‌పర్సన్ మీసాల సురేష్ బాబు, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు బెల్లాల శ్రీనివాసరావు, పట్టణ వైసిపి అధ్యక్షుడు సనపల సింహాచలం పాల్గొన్నారు.

## వాలంటీర్లపై విషం కక్కిన టిడిపి

**టెక్కలి రూరల్ :** పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ఆపినందుకే చంద్రబాబు నాయుడు కుట్ర పన్నారని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వాలంటీరు వ్యవస్థతో చంద్రబాబుక వణుకు పుడుతుందని పేర్కొన్నారు.

**ఇచ్ఛాపురం :** ప్రభుత్వ పథకాల లబ్ధిదారులపై, వాలంటీర్లపై చంద్రబాబు నాయుడి కుట్రలు మరొకసారి నిరూపితమయ్యాయని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రతినెలా సకాలంలో అవ్వాతాతలకు, వికలాంగులకు పింఛన్లు అందించడంలో కీలక పాత్ర పోషించే వాలంటీర్లపై మొదటి నుంచీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు వాలంటీర్ల ద్వారా ఫించను పంపిణీ కాకుండా, ఇతర అన్ని విధుల్లో పాల్గొనకుండా, కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఉత్తర్వులు వచ్చేలా చంద్రబాబు నాయుడు కుట్రపూరితంగా వ్యవహరించారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్‌పట్నాయక్, టౌన్ జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, పరపతి మంజులత, కోటి, ప్రత్తి అన్వేష్, సిగ్గ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

## సాగునీరు అందేలా చూస్తా

ప్రజాశక్తి- పలాస

వజ్రపుకొత్తూరు మండలంలో శివారు భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే శివారు భూములకు సాగునీరు అందేలా చూస్తామని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష హామీ ఇచ్చారు. పలాస టిడిపి కార్యాలయంలో ఆదివారం వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లికి చెందిన పలువురు మహిళలు, రైతులు గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ మాజీ మంత్రి గౌతు శివాజీ హయాంలో శివారు భూములకు సాగునీరు అందేదని, వైసిపి ప్రభుత్వంలో ఐదేళ్లుగా చుక్క నీరు సరఫరా కాలేదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో గౌతు శిరీషను గెలిపించు కుంటామని, ఎన్నికల్లో అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేంబాబుచౌదరి, దువ్వాడ జయరాం చౌదరి, సనపల్లె చక్రవర్తి, దువ్వాడ వనజనాభంసంధ్య చౌదరి, లలితకుమారి, కృష్ణవేణి, స్వాతి, పద్మ, కృష్ణవేణి, నళిని, నిర్మళ, పుష్పలత, రాజేశ్వరి, చంద్రకళ పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన

**కొత్తూరు :** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డిటి ఎన్.సత్యనారాయణ సూచించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ఫ్లెక్సీలను ఆదివారం ఏర్పాటు.చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగంపై సమాచారం కావాలంటే హెల్ప్‌లైన్ నంబరు 1950కి కాల్ చేయాలన్నారు. ఈయనతో పాటు విఆర్‌ఒ రాజగోపాలరావు ఉన్నారు.

**టెక్కలి రూరల్:** మహిళలందరూ ఓటు హక్కు వినియోగించుకోని ప్రజాస్వామ్యాని కాపాడాలని వెలుగు సిబ్బంది ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఆదివారం టెక్కలి మేజర్ పంచాయతీలో చేరివీధి, కంచ్ర వీధి, గొల్ల వీధి, భూలోకమాత వీధి, శ్రీనివాస్‌నగర్‌లో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఎం గురుబెల్లి నారాయణరావు, సిసిలు పద్మ, వరదరాజులు, విఎఒ భవాని పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న సంఘ సభ్యులు

## యువ సేవా సంఘం ఆర్థికసాయం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని కోష్ట పంచాయతీ పల్లిపేట శ్రీరామ యువ సేవా సంఘం సభ్యులు అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ఆర్థికసాయం ఆదివారం చేపట్టారు. వల్లభరావు గ్రామానికి చెందిన కొప్పల రాము, కుటుంబ సభ్యులు ఇటీవల వత్సవలస జాతరకు వెళ్తుండగా కుటుంబసభ్యులందరూ ప్రమాదానికి గురై ప్రస్తుతం విశాఖ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాము కుటుంబ సభ్యులకు రూ. 55 వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే కోష్టకి చెందిన ఎడ్ల జగ్గునాయుడు కిడ్నీల సమస్యతో బాధపడుతుండడంతో రూ.10 వేలు అందించారు. దువ్వాన పేటకు చెందిన ఎరుకొండ జగదీష్ ఊపిరితిత్తుల వ్యాధితో ఇబ్బంది పడుతుండడంతో రూ. 10 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌వైఎస్ అధ్యక్షులు పల్లె పాపరాజు, ఉపాధ్యక్షులు పిసిని శ్రీనివాసరావు, కోశాధికారి పల్లె రమేష్, సంఘ సభ్యులు పల్లె మహేష్, పిసిని సత్యం పాల్గొన్నారు.



వెదుళ్లవలసలో ఇంటింటా ప్రచారం చేపడుతున్న గాంధీ

## ఇంటింటా గాంధీ ప్రచారం

**ఆమదాలవలస :** నియోజకవర్గంలో గడచిన కొన్నేళ్లుగా పదవులు అనుభవిస్తున్న అసమర్థ నాయకులను ప్రజలు ఇంటికి పంపించాల్సిన సమయం ఆసన్నమైందని స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. ఆదివారం మండలంలోని వెదుళ్లవలస, కట్యాచార్యులపేటలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి తనకు ఒక్క అవకాశం ఇచ్చి రానున్న ఎన్నికల్లో గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం మాట్లాడుతూ గడచిన కొన్నేళ్లుగా నియోజకవర్గంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మామ, అల్లుళ్లు ఎన్నికల్లో పోటీ చేసి ఒకరినొకరు దూషించుకొని తీరా ఎన్నికలయ్యాక ఇద్దరు కలిసి అవినీతి సొమ్ములో వాటాలు పంచుకుంటున్నారన్నారు.ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వెళ్లే ఎనిమిది కిలోమీటర్ల రహదారిని నిర్మించుకోలేని అసమర్థ నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్నెపు సూరిబాబు, సువ్వారి అనిల్ కుమార్, పూర్ణారావు, మోహన్, బగాది నేతాజీ, సందీప్, చంద్రశేఖర్, చంద్ర, మధు, కిరణ్, శివ, సంతోష్, వసంత, శేఖర్, పాల్గొన్నారు.

## చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు

**ఇచ్ఛాపురం:** స్థానిక ఆంధ్రా బాపిస్ట్ చర్చిలో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ ప్రవీణ్ కుమార్ అధ్వర్యంలో ఈస్టర్ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్షులు ప్రత్తి విజయకుమార్, ఎం.వి.ఎస్.ఎన్ మూర్తి, గోపాలరావు, వి.వెంకటేష్, లక్ష్మీ నారాయణ, జోష్ కుమార్, వీరకుమార్, ప్రత్తి అన్వేష్ పాల్గొన్నారు.

# నవోదయకు విద్యార్థుల ఎంపిక



ఓంశ్రీ ప్రకాష్



హిమశ్రీ



భవిష్యశ్రీ గాయత్రి

**ఆమదాలవలస:** మండలంలోని బెలమాం పంచాయితీ లొద్దలపేట ప్రాథమిక పాఠశాలలో 5వ తగరతి చదువుతున్న గురుగుబెల్లి ఓంశ్రీ ప్రకాష్ జవహర్ నవోదయ విద్యలయ (వెన్నెలవలస) పాఠశాలకు 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించాడని పాఠశాల హెచ్‌ఎం దుప్పల అప్పలనాయుడు తెలిపారు. ఈ ప్రవేశపరీక్షను రాయడానికి పాఠశాల ఉపాధ్యాయులు శిక్షణ, తల్లిదండ్రులు సహకారం ఎంతగానో ఉపయోగపడిందని ఓం శ్రీ ప్రకాష్ తెలిపారు. ఓం శ్రీ ప్రకాష్ ఇటీవల సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షలో కూడా 228 మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించాడు. జవహర్ నవోదయ విద్యలయ పాఠశాలకు తమ గ్రామానికి చెందిన విద్యార్థి ఎంపికకావడం పట్ల గ్రామస్తులు, పెద్దలు ఆనందం వ్యక్తం చేస్తూ ఓం శ్రీ ప్రకాష్‌కు అభినందనలు తెలిపారు. అలాగే సరుబుజ్జిలి మండలం గోనెపాడుకు చెందిన సీపాన హిమశ్రీ నవోదయ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించింది. ఈమె తండ్రి ఆనందరావు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. హిమశ్రీ నవోదయకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

**సంత బొమ్మాళి:** లక్ష్మి పురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన రెడ్డి భవిష్యశ్రీ గాయత్రి ఎంపికైంది. ఈమె తండ్రి సూరిబాబు లక్ష్మీపురం పాఠశాల ఉపాధ్యాయుడుగా పనిచేస్తునారు. తల్లి పావని వ్యవసాయ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భవిష్యశ్రీ ఎంపిక పట్ల కుటుంబసభ్యులు, ఎంఇఒలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

**పాతపట్నం:** పాతపట్నంలో గల ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థి బిసాయిమోహిత్ ఆదివారం విడుదల చేసిన నవోదయ ప్రవేశ పరీక్షలో ఎంపికయ్యాడని స్కూల్ ప్రిన్సిపాల్ వెంకట రమణ తెలిపారు. విద్యార్థి నవోదయకు ఎంపికకావడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

**టెక్కలి:** స్థానిక సర్వమంగళ వీధిలోని విజ్ఞాన్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న కె.ధృవన్‌చాతుర్య జవహర్ నవోదయ వెన్నెలవలస పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించారని పాఠశాల కరస్పాండెంట్ రాజశేఖర్ తెలిపారు. శిక్షకుడు ఆర్.కృష్ణారావును అభినందించారు.

# వైసిపి విస్తృత ప్రచారం



ఆమదాలవలస : పోస్టర్లు పంపిణీ చేస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సంక్షేమం, అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం మండలంలోని మునగవలస, ధన్నానపేట, సంత కొత్తవలస గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం మాట్లాడుతూ వైసిపి పాలనలో పేదల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయని అందుకే మరోసారి వైసిపికి ఓటువేసి మరోసారి జగన్మోహన్ రెడ్డిని బలపర్చాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ నిరంజన్ బాబు, సర్పంచ్ ప్రతినిధి రాయి చిన్నారావు, దన్నాన సత్యం, ధన్నాన రవి, యర్రంనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మెళియాపుట్టి :** ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమారుడు రెడ్డి శ్రావణ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వసుందర, కోసమాల గ్రామాల్లో గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, జయముని, సలాన చిట్టి పాల్గొన్నారు.

**పలాస :** మండలంలోని బ్రాహ్మణతర్ల, పండాశాసనం గ్రామాల్లో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావుచిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, గొండు మోహనరావు, దంతం వైకుంఠరావు. బాడాన పుష్ప, తుంగాన రవణమ్మ. కర్ర గంగాధర్‌రావు, పొట్టూరు తారక రామారావు, గరికి ధర్మారం, జామి సంతు, కోరాడ నాగరాజు, బాడన నాగరాజు, వడ్డీ హేమలత వైసిపి తరుపున ప్రచారం చేశారు.

అప్పలరాజును ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ చతీష్‌ఘడ్ రాష్ట్రం బిలాయ్‌లో వైసిపి నాయకులు వజ్రపుకొత్తూరు మండలం కంబాల రాయుడుపేట సర్పంచ్ వంక చిరంజీవి, దౌలపల్లి శ్రీనివాసరావు, రుద్రమూర్తి, వంక వెంకటరావు, తిరుపతిరావు, గిరిబాబు ప్రచారం చేశారు.



పలాస : బ్రాహ్మణతర్లాలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

**ఇచ్ఛాపురం :** పట్టణంలోని 4,5 వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, సాలిన ఢిల్లీరావు, గేదెల సోమయ్య, కిరమని బెహర, ప్రత్తి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# సేవలే గుర్తింపునిస్తాయి



శ్రీకాకుళం అర్బన్ : గౌరవ సత్కారాన్ని స్వీకరిస్తున్న ధర్మారావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉపాధ్యాయ వత్తిలో తాను సంతృప్తి పొందానని సన్మాన గ్రహీత ముంజేటి పాపారావు అన్నారు. మండలంలోని అక్కుపల్లి మహాత్మా జ్యోతరావు పూలే మత్స్యకార గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ముంజేటి పాపారావు పదవీ విరమణ గావించారు. ఈ మేరకు ఆదివారం తోటి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, వైద్యులు పాపారావు దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. పలువురు మాట్లాడుతూ సేవలే గుర్తింపు తేస్తాయని అన్నారు. సుదీర్ఘ కాలం ఉపాధ్యాయునిగా, ప్రిన్సిపాల్‌గా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, నిబద్ధతతో ఆయన కృషి చేశారని పలువురు కొనియాడారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని తాను ఎంతగానో ఆస్వాదించానని అన్నారు. ఉద్యోగ విరమణ తరువాత కూడా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గుర్తించినప్పుడే నిజమైన సన్మామని అన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు బొనెల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**పొందూరు:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పసుమర్తి రామమనోహర్ సేవలు చిరస్మరణీయమని జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి కోట ప్రకాశరావు అన్నారు. ఆదివారం ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఇజ్జాడ మల్లేశ్వరరావు అధ్యక్షత ఏర్పాటు చేసిన రామ్ మనోహర్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆర్ఐఒ తవిటినాయుడు మాట్లాడుతూ రామ్ మనోహర్ దశాబ్దకాలం పాటు ఈ కళాశాలను క్రమశిక్షణా యుతంగా నిర్వహించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామ్ మనోహర్, పద్మజ దంపతులను జ్ఞాపిక, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు.



వజ్రపుకొత్తూరు : పాపారావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



పొందూరు : రామ్ మనోహర్‌ను సత్కరిస్తున్న ప్రకాశరావు

**శ్రీకాకుళం అర్బన్:** జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులుగా పనిచేసి ఐ.ధర్మారావు ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈ మేరకు సహచర ఉద్యోగులు నగరంలోని హోటల్ గ్రాండ్‌లో ఆదివారం సన్మానించారు. 29 ఏళ్ల పాటు చేనేత జౌళిశాఖలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. రాజమహేంద్రవరం ఆర్‌జెడి ధనుంజయ్‌రావు, ఆర్‌జెడి రాజారావు, కాకినాడ ఎడి పెద్దిరాజు, విజయనగరం ఎడి మురళి, జిల్లా పౌర సంబంధాల అధికారి బాలమాన్ సింగ్, ఆప్కో జిఎం సోమేశ్వరరావు పాల్గొని ధర్మారావు సేవలను ప్రస్తావించారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ 1995లో హైదరాబాద్‌లో విధుల్లో చేరిన తాను 2018లో అమరావతికి వచ్చానని అన్నారు. సహాయ సంచాలకునిగా సొంత జిల్లా శ్రీకాకుళం 2022లో బదిలీపై వచ్చానని చెప్పారు. జిల్లాలో సహాయ సంచాలకులుగా విధులు నిర్వహించడం ఆనందాన్ని కలిగించిందన్నారు.

# వైసిపిలో పలువురు చేరిక



రణస్థలం : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలం అల్లివలస పంచాయతీలో జనసేన, టిడిపి పార్టీ నుంచి 54 కుటుంబాలు ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సమక్షంలో ఆదివారం వైసిపిలో చేరారు. పార్టీలోనికి చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చీకటి ధనలక్ష్మణరాజు, మైలపల్లి కాముడు, వాసుపల్లి రాముడు, చీకటి పెద్దయర్రయ్య తదితరులున్నారు. కార్యక్రమంలో మండలం పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, అల్లివలస పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి చీకటి యర్రయ్య, వైసిపి నాయకులు మైలపల్లి వెంకటేష్, దుమ్ము పండోడు, మాగుపల్లి సోమయ్య, వాసుపల్లి బుజ్జి, దుమ్ము పొట్టివాడు, మాగుపల్లి పొట్టివాడు పాల్గొన్నారు.

**పోలాకి :** నరసన్నపేట, పరిసర గ్రామాలకు టిడిపి, జనసేన నాయకులు 200 మంది వైసిపిలోకి చేరారు. వీరికి జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య వైసిపి కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో దండి జయప్రకాష్, తర్ర చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

**పలాస :** పలాస మంత్రి కార్యాలయంలో ఆదివారం పశు సంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో మందస మండలం హరిపురానికి యువకులు టిడిపి నుంచి వైసిపిలో చేరారు. వారికి మంత్రి అప్పలరాజు వైసిపి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపిలో చేరిన వారిలో యలగా వంశీ, జన్నీ, దుర్గ, రోకల్లా మహేష్, తమ్మిరెడ్డి శేఖర్, గోకర్ల దుర్యోధన్, డబ్బీరు రంజిత్, జగన్నాథపురం అజయ్, అనల రాజు, జన్నీ, ప్రశాంత్, రట్టి దీపక్, తామడ కన్నబాబు ఉన్నారు. కార్యక్రమంలో పసుపురెడ్డి ప్రదీప్ కుమార్, సాలిన నాని, బత్తిన చిరంజీవి, మావుడెల్లి రాజేష్, టేకి రాజేష్, మావుడెల్లి జీవన్, ఉమాశంకర్, పాండవ సాయి, నెయ్యాల కవి, ఖగేష్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

**శ్రీకాకుళం అర్బన్ :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ధనస్వామ్యాన్ని కాదని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని జై భారత్ నేషనల్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.రమణ పిలుపునిచ్చారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో ఉన్న ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జై భారత్ పార్టీ రెండు దశాబ్దాలుగా దేశ వ్యాప్తంగా ప్రజాస్వామ్య విలువలపై విస్తృత ప్రచారం సాగిస్తోందని, 14 రాష్ట్రాల్లో జై భారత్ నేషన్ పార్టీ జస్ట్ ఓటు పేరిట క్యాంపెయిన్లు నిర్వహించినట్లు తెలిపారు. అవినీతి గల నేతలను ఎన్నుకోవడం వల్ల ప్రజాస్వామ్యానికి పెను ముప్పు వాటిల్లుతోందన్నారు. సమావేశంలో నాయకులు ఎం.రాఘవదాస్, ఎం.త్రిమూర్తులు, నాగభూషణం, కొల్లాన సోమేశ్వరరావు పాల్గొన్నారు.

## మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

**శ్రీకాకుళం అర్బన్:** నగరంలోని బగ్గు సరోజినీదేవి ఆస్పత్రిలో మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స ఆదివారం విజయవంతమైందని ఎండీ, న్యూరాలజిస్టు బగ్గు శ్రీనివాసరావు తెలిపారు. నిపుణులతో కూడిన ప్రత్యేక బృందం ఈ శస్త్ర చికిత్స నిర్వహించినట్లు చెప్పారు. ఆర్థో పెడీషియన్ సుగ్గు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన ఆర్థో పెడీషియన్ బూసిరెడ్డి నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. కీళ్ల మార్పిడికి సంబంధించిన అన్నిరకాల శస్త్ర చికిత్సలకూ అధునాత ప్రక్రియ ఆస్పత్రిలో అందుబాటులో ఉందని అన్నారు. ఈ చికిత్సతో బాధితులకు ఆనందం నింపారని వివరించారు. మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలకు సంబంధించి ఇకపై సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా బగ్గు సరోజినీ దేవి ఆస్పత్రిలో అత్యాధునిక ప్రపంచ స్థాయి సాంకేతికతతో ఆపరేషన్ థియేటర్‌ను నెలకొల్పామని చెప్పారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.



ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

# ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ డ్రైవర్‌పై దాడి


ప్రజాశక్తి- పలాస

మందస మండలం కళింగదళ్ జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న దేవరాజుపై దాడి జరిగింది. క్షతగాత్రుడు, మందస పోలీసుల కథనం మేరకు మందస మండలం గౌడు గురింటికి చెందిన వగాడి దేవరాజు ఉదయం నాలుగు గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై పలాస ఆర్‌టిసి డిపోకు వెళ్తుండగా మందస పోలీసుస్టేషన్‌కు చెందిన మఫ్టీలో ఉన్న పోలీసులు దేవరాజుకు వాహనం ఆపాలని చెప్పడంతో ఆపకుండా వెళ్లిపోవడంతో సివిల్ డ్రెస్‌లో ఉన్న ఐదుగురు పోలీసులు కళింగదళ్ జంక్షన్ వద్ద కర్రలతో మూకొమ్మడిగా దాడి చేశారు. దీంతో గాయాలతో మందస పోలీసు స్టేషన్‌కు వెళ్ళి తనకు న్యాయం చేయాలని స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఇదిలా ఉండగా గత మూడు నెలల క్రితం వైసిపి నుంచి టిడిపిలో చేరడంతో బుడారసింగ్ సర్పంచ్ సురేష్ పాణిగ్రహి పోలీసులతో తనపై దాడి చేయించారని దేవరాజు ఆరోపించారు. అనంతరం క్షతగాత్రుడును హరపురం సిహెచ్‌సికి తరలించి వైద్యసేవలు అందించారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, టిడిపి నాయకులు, అనుచరులతో కలిసి హరపురం సిహెచ్‌సికి చేరుకొని బాధితుడును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి నేతల ప్రోద్బలంతోనే పోలీసులు దాడి చేశారని ఆమె ఆరోపించారు. వైసిపిని వీడి టిడిపిలో చేరిన వారందరిపైన బుడారసింగి వైసిపి నాయకుడు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఘటనకు పాల్పడిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. దేవరాజుపై దాడిచేసిన కానిస్టేబుళ్లు ఎస్.రవికుమార్, సంతోష్ కుమార్, కృష్ణారావు, కేశవరావుపై కేసు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు కోసం ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడం జరిగిందని మందస ఎస్ఐ తెలిపారు.



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న శిరీష

## నా ప్రయాణం వైసిపితోనే



మాట్లాడుతున్న గోపాల్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తన ప్రయాణం వైసిపితోనేనని రెయ్యిపాడు పంచాయతీ 7వ వార్డు సభ్యుడు వానపల్లి గోపాల్ అన్నారు. ఆదివారం రెయ్యిపాడులో విలేకరులతో మాట్లాడుతూ శనివారం తాను పూండిలో మార్కెట్ చేస్తుండగా తమ గ్రామానికి చెందిన కొంతమంది టిడిపి నాయకులు పలాసలో పని ఉందని తీసుకెళ్లారని, అక్కడ పెద్ద భవనం వద్దకు తీసుకెళ్లి కొంతసేపు తనను బయట ఉంచారని, అనంతరం లోపలకు తీసుకెళ్లి టిడిపి నాయకులు శిరీషతో టిడిపి కండువా వేయించారన్నారు. స్థానిక వైసిపి నాయకులు, తన కుటుంబ సభ్యులు తనను వార్డు సభ్యుడుగా చేశారని అటువంటి పార్టీని కాదని టిడిపిలోకి వెళ్లే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. నేను కేవలం వార్డు సభ్యుడునేనని ఉప సర్పంచ్‌గా టిడిపి నాయకులు పత్రికల్లో తప్పుడు రాతలు రాయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బచ్చల ధర్మారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మద్దిల హరి నారాయణ మాట్లాడుతూ విషయం చెప్పకుండా బలవంతంగా పార్టీ కండువాలు వేయడం టిడిపి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.



నాటు సారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

## నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలం రింపి, మూలరింపి గ్రామాల్లో ఆదివారం పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 50 లీటర్ల నాటు సారాను స్వాదీనం చేసుకుని, 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో పాతపట్నం సిఐ ఎన్ సాయి, మెళియాపుట్టి ఎస్ఐ టి.రాజేష్, పాతపట్నం ఎస్ఐ, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

## అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై కేసు నమోదు


ప్రజాశక్తి- పొందూరు

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ పట్టణంలో వైసిపి అభ్యర్థి తమ్మినేని సీతారాంతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఎ.రామకృష్ణపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎన్నికల్ల ప్రచారంలో పాల్గొంటున్నట్లు ఎన్నికల అధికారులకు టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఎంసిసి అధికారుల ఆదేశాలు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి- పొందూరు

జిల్లాలో గార పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన మండలం పిల్లలవలసకు చెందిన కానిస్టేబుల్ బూర సురేష్ కుటుంబానికి ఆదివారం రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. ఎస్‌పి జి.రాధిక ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అసోసియేషన్ తరుపున డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి ఈ ఆర్థికసాయం అందించారు. పిల్లలవలసలో కానిస్టేబుల్ భార్యకు పద్మావతికి అసోసియేషన్ ప్రతినిధులు ఆర్.కృష్ణంనాయుడు, భుజంగరావు, కె.రాధాకృష్ణలు చెక్కును అందించారు.



పగలే వెలుగుతున్న విద్యుత్ లైటు

## పట్టపగలే వెలుగులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని బొబ్బిలి పేటలో నిత్యం విద్యుత్ వీధి దీపాలు వెలగడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గడిచిన వారం రోజులుగా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయని వాటిని ఆర్పేందుకు సంబంధిత విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు విద్యుత్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క విద్యుత్ అధికారులు విద్యుత్‌ను పొదుపు చేయాలంటూ ప్రకటనలు గుప్పిస్తుంటే దిగువ స్థాయి సిబ్బంది వాటిని పెడ చెవిన పెట్టడం విడ్డూరంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామంలో నిత్యం వెలుగులు విరజల్లుతున్నాయని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'గుండ' దంపతులు

## తల్లిదండ్రులతో సమానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గుండ దంపతులు తనకు తల్లిదండ్రులతో సమానమని, వారిని ఎప్పటికి గౌరవిస్తానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద జనసేన ఆధ్వరాన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి ప్రభుత్వంలో మంత్రిగా ధర్మాన ప్రసాదరావు ప్రాతినిధ్యం వహిస్తున్నా అభివృద్ధికి నోచుకునేంతగా నిధులు తీసుకురాలేక పోయారన్నారు. రహదారులు, తాగునీరు, సాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేదన్నారు. ఐదేళ్లుగా శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డంతా గోతుల మయంగా మారినా పట్టించుకోలేదన్నారు. గతంలో స్టేడియం కోసం దీక్షలు చేసి రోడ్డెక్కిన మంత్రి గత ఐదేళ్లలో ఏం చేశారో చెప్పాలన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాని విమర్శించారు. కార్యక్రమంలో చల్లా వెంకటేశ్వరరావు, కోరాడ సర్వేశ్వరరావు, నాయకులు కోరాడ హరగోపాల్, కోరాడ రమేష్, అంబటి లక్ష్మీరాజ్యం, మైలపల్లి నర్సింగరావు, గణగళ్ల మూర్తి, పాండ్రంకి రమేష్‌నాయుడు, దొండపాటి నవీన్, మూర్తి, మాధవి, బుర్రి మధు పాల్గొన్నారు.

## పెద్దపాడు అంటే అంత కక్ష ఎందుకో?

**శ్రీకాకుళం అర్బన్ :** దశాబ్దాలుగా మంత్రి ధర్మాన ప్రసాదరావును నమ్మి ఆయన వెంటే నడిచామని, ఐదేళ్ల నుంచి ఆయన నుంచి ఒక్క పిలుపు కూడా రాలేదని వైసిపి కలగ శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని పెద్దపాడులో తన నివాసంలో గ్రామస్తులతో కలిపి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ల క్రితం క్రితం గ్రామంలో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నామని చెప్పారు. గ్రామంలో ఇరుకైన రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని, శ్మశాన వాటికకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం కావాలని కోరామని అన్నారు. తాగునీరు అందక అవస్థలు పడుతున్నామని, ఇంటింటికీ కుళాయి సౌకర్యాన్ని కల్పించాలని విన్నవించామని చెప్పారు. రేషన్ డిపోల్లో సరుకులు సక్రమంగా అందడం లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదు చేశామని అన్నారు. ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదన్నారు. సమావేశంలో కాల వెంకటరావు, మామిడి శంకర్రావు, తంగి సూర్యారావు, కోనారి నాగరాజు, తంగి పోలినాయుడు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

**లావేరు:** స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ముగ్గురు విద్యార్థులు వేమన, భాస్కర, సుమతి శతకాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.